క్లుప్తంగా

దర్శనానికి బారులు తీరిన భక్తులు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారులు తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనార్థం ఉదయం నుంచే క్యూలైన్లో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక సత్యానారాయణ స్వామి వత్రాలు చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎంతో యూత్ అధ్యక్షుడు నర్సింహాచారి

కందుకూరు: కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు దంతోజు నర్సింహాచారి, మండల కో ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్ తదితరులు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు పలువురు ఉన్నారు.

ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి



నివాళులర్పిస్తున్న ఆర్ గోపాల్, తదితరులు

హుడాకాంప్లెక్స్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రజా సమస్యల పరిష్కార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ గోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన వర్ధంతి సందర్భంగా సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గోపాల్ పాల్గొని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి యువతరానికి ఆదర్శదాయకమన్నారు. విద్యార్థి దశ నుంచే ఆయన జీవితమంతా ప్రజా పోరాటాలతోనే గడిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మహబూబ్, రేకల శ్రవణ్‌కుమార్, సంపత్‌కుమార్, మహ్మద్ జాయిద్, ప్రసాద్, రంజిత్, నాగమ్మ, పూలమ్మ, కళావతి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పి సబితారెడ్డి

మహేశ్వరం: నందుపల్లి గ్రామంలో హోలీ సందర్భంగా చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఇద్దరు యువకులు మృతి చెందారు. మంగళవారం మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితారెడ్డి స్థానిక నాయకులతో కలిసి వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చెరువులో ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు ఊపిరాడక ఇద్దరు యువకులు మృతి చెందడం బాధాకరమని ఆమె తెలిపారు. ఇద్దరు యువకులు బీఆర్‌ఎస్‌లో చురుకుగా పని చేసేవారన్నారు. వారి ఆత్మకు శాంతి చేకురాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, గొల్లూరు ఎంపీటీసీ రమేశ్, నందుపల్లి సర్పంచ్ దేశపాగ కళావతి, మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దేశపాగ కిష్టయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్రె రాజు, నందుపల్లి కుమార్, దేశపాగ మహేందర్, జయేందర్, అలీపాషా, ఎం రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల రవాణాలో జాగ్రత్తలు కీలకం



వాహనంలో తరలిస్తున్న పశువులు



షెడ్‌లో పశువులు



డాక్టర్ సంధ్యారాణి, పశువైద్యురాలు, లేమూరు

- మేలు రకాల కొనుగోలుకు రైతుల ఆసక్తి
- వైద్యులు ధ్రువీకరించిన సర్టిఫికెట్ ఉండాల్సిందే
- ఒక్కోవాహనంలో 6నుంచి 8 పశువుల తరలింపు
- నిబంధనలు పాటించాలి

కందుకూరు: అధిక పాల దిగుబడి ఇచ్చే మేలు రకం పశువుల కోసం జిల్లాకు చెందిన రైతులు మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానా, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూర్ వంటి ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తుంటారు. అక్కడి నుంచి వందల కిలోమీటర్ల మేర తీసుకురావాలంటే సరైన జాగ్రత్తలు పాటించాలని, లేకపోతే నష్టాలు తప్పవని లేమూరు పశువైద్యురాలు డాక్టర్ సంధ్యారాణి పేర్కొంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చే వాటిని వాహనాల్లో అధిక సంఖ్యలో తరలించడంతో ఇక్కడికి వచ్చే సరికి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు. పశువుల కొనుగోలు, రవాణాపై ఆమె పలు సూచనలు, సలహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పాటించాల్సిన నియమాలు..

పాడి పశువులను సుదూర ప్రాంతాలనుంచి, ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చే సమయంలో విధిగా వెటర్నరీ వైద్యుడితో పాటు పశుపోషణ, పాడి రంగంపై అనుభవం ఉన్న రైతులను వెంట తీసుకెళ్లాలి. ఆరోగ్యవంతంగా, చురుగ్గా ఉన్న పశువులను ఎంపిక చేయాలి. పశువుల శరీర లక్షణాలను గుర్తించి వాటి పాల ఉత్పత్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలగాలి. కొనుగోలు ప్రాంతంనుంచి తరలించే సమయంలో శారీరకంగా, మానసికంగా వత్తిడికి గురికాకుండా జాగ్రత్త వహించాలి. వాహనాల్లోని అంచులకు మేకులు, చీలిన రేకులు, బోల్టులు వంటి గాయాలు చేసేవి ఉండకుండా చూసుకోవాలి. లోపలి అంచులకు గడ్డితో నింపిన సంచులను వేసుకోవాలి. పశువుల శరీరం రాపిడికి గురికాకుండా ఉండేందుకు గడ్డి సంచులను ఉపయోగించుకోవాలి. వాహనానికి అడ్డంగా పైన ఏర్పాటు చేసిన కట్టెలు లేదా బొంగులపై పశువుల తల భాగం ఉండేటట్లు కట్టాలి. ఒకే ఎత్తు ఉన్న పశువులను ఒకే వరుసలో కట్టాలి. కాళ్ల కింద మందంగా గడ్డి పరవాలి. దూడలను పశువులు తొక్కే ప్రమాదం ఉంది కాబట్టి ఇతర వాహనాల్లో వాటిని తరలించాలి. పశువులను తరలించే సమయంలో ఒకేసారి మేత, నీరు ఇవ్వకుండా, మధ్య మధ్యలో కొద్ది కొద్దిగా ఇవ్వాలి. వాహనంలో ఎక్కించిన తర్వాత పశువులు సౌకర్యవంతంగా ఉన్నాయా? లేవా? అని గమనించాలి. రవాణా సమయంలో పడుకోనివ్వకూడదు. చూడి పశువుల విషయంలో మరింత జాగ్రత్త అవసరం.

సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఇవ్వాలి..

ఇంటికి చేరాక కొత్త వాతావరణానికి అలవాటు పడే వరకూ ఓర్పు, ప్రేమతో మచ్చిక చేసుకోవాలి. ప్రయాణ బడలిక పోవడానికి విటమిన్లు, ఖనిజ లవణాలను అందించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో గోరు వెచ్చని నీటితో కడగాలి. సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని అందజేయాలి. వారం పాటు లివర్‌టానిక్ వంద మిల్లీ లీటర్ చొప్పున తాగించాలి. ప్రయాణానికి ముందు తర్వాత శరీర బడలిక మందులు వాడాలి. ఎన్‌సైడ్స్ ఇన్‌జెక్షన్లు, ఇమ్యూన్ బూస్టర్లు, స్ట్రెస్ రిలీవర్ టానిక్ మందులు ఇవ్వాలి. దీంతో అనారోగ్యం బారిన పడకుండా పశువులను కాపాడుకోవచ్చు. వేసవిలో పశువు రవాణా చేయాల్సి వస్తే రాత్రి వేళలో మాత్రమే ప్రయాణం సాగించాలి. మధ్యాహ్నం తరలించాల్సి వస్తే మధ్య మధ్యలో వాహనాన్ని ఆపుకుంటూ పశువు శరీరంపై నీళ్లు చల్లాలి. సమీప ప్రాంతాల్లో 20 కిలోమీటర్ల లోపు కొనుగోలు చేసిన పశువులనైతే వాహనాల్లో కాకుండా నడిపించి తీసుకెళ్లడమే మేలు. మధ్యలో అరగంట నుంచి గంట పాటు విశ్రాంతి ఇవ్వాలి. లేదంటే కాళ్లు మెత్తబడి మేత సరిగా తినక నీరసిస్తాయి.

సర్టిఫికెట్ తప్పనిసరి..

పశువులను రవాణా చేసే సమయంలో ముందుగా అర్హులైన పశువైద్యుడు ధ్రువీకరించిన సర్టిఫికెట్ తప్పని సరిగా తీసుకోవాలి. 1978 పశువుల రవాణా యాక్ట్ ప్రకారం నిర్దేశించిన వాహనాల్లోనే వాటిని తరలించాలి. వాహనాన్ని బట్టి 6 నుంచి 8పశువులను రవాణా చేయాలి. ఒకదానికికొకటి తగలకుండా ఉండేలా రవాణా చేయాలి. చూడి వాటితో ఇతర పశువుల్ని రవాణా చేయొద్దు. నిబంధనలు పాటించకపోతే ఆ వాహనాన్ని ఆర్టీఏతో పాటు పోలీసులు సీజ్ చేసే అవకాశం ఉంటుంది. పెటా యాక్ట్ ప్రకారం కేసులు కూడా నమోదు చేయొచ్చు. పశువులకు మార్గమధ్యలో మేత, నీరు ఏర్పాటు చేయాలి. నిబంధనలు తప్పకుండా పాటించేలా సంబంధిత యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలి.

అసైన్డ్ భూములిచ్చేది లేదు

ఎంపీటీసీ లక్ష్మమ్మ

యాచారం: మొండిగౌరెల్లి గ్రామంలో ఉన్న అసైన్డ్ భూములు కంపెనీలకు ఇచ్చేది లేదని.. ఆ భూములు తీసుకుంటే పేద రైతులు జీవనోపాధి కోల్పోతారని చింతపట్ల, మొండిగౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ స్పష్టం చేశారు. తాజాగా సర్కార్ మొండిగౌరెల్లి గ్రామంలోని 19, 68, 127 సర్వే నంబర్లల్లో ఉన్న దాదాపు 1,500 ఎకరాలకు పైగా అసైన్డ్, ప్రభుత్వ భూములను కంపెనీలకు తీసుకోవాలని నిర్ణయించి, సమగ్ర సర్వేకు నిర్ణయించింది. వారం కింద ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి మొండిగౌరెల్లిలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను సర్వే చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ ఆధ్వర్యంలో బీజేపీ బృందం మంగళవారం యాచారం తహసీల్దార్ అయ్యప్పకు వినతి పత్రం అందజేసింది. మొండిగౌరెల్లి గ్రామంలోని అసైన్డ్, ప్రభుత్వ భూములను కంపెనీలకు ఇచ్చేది లేదని తెలిపారు. ఏళ్ల కింద పేద రైతులకు అసైన్డ్ సర్టిఫికెట్లు ఇచ్చినప్పటికీ చాలామంది రైతుల పేర్లు ధరణి పోర్టల్‌లో నమోదు కాకపోవడంతో పట్టాదారు, పాసుపుస్తకాలు అందడం లేదని తెలిపారు. అసైన్డ్ భూములను సర్వేచేసి ముందు రైతుల పేర్లను ధరణి పోర్టల్‌లో నమోదు చేసి పట్టాదారు, పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్వాకం వల్ల పేదరైతులకు కొన్నేళ్లుగా రైతుబంధు, రైతుబీమా, బ్యాంకు రుణాలు అందడం లేదని వాపోయారు. ఈవిషయమై తహసీల్దార్ అయ్యప్ప ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు సందీప్‌రెడ్డి, వెంకటేష్, కుంచారపు రాజవర్ధన్‌రెడ్డి, కట్టెల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జ్ఞాన మహా సభలు



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న నక్షత్ర ఆస్పత్రి వైద్యులు

నక్షత్ర ఆస్పపత్రి, బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

బడంగ్‌పేట్: బాలాపూర్‌లోని ఎస్‌పీఆర్ గార్డెన్‌లో సనాతన వేదాంత జ్ఞాన మహా సభలు కొనసాగుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి పీఠాధిపతులు, స్వామిజీలు, వేలాది మంది భక్తులు పాల్గొంటున్నారు. అందులో భాగంగానే ఎల్‌బీనగర్ నాగోల్‌లోని నక్షత్ర ఆస్పత్రి, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సనాతన వేదాంత జ్ఞాన సభ వద్ద నిర్వహించారు. ఈ శిబిరంలో మూడు వందలకు పైగా భక్తులు పాల్గొని బీపీ, బీఎంఐ, ఈసీజీ, షుగర్, పరీక్షలు చేయించుకున్నారు. నక్షత్ర ఆస్పత్రి వైద్యులు జనరల్ మెడిసిన్, డయాబెటాలజిస్ట్, ఊపిరితిత్తులు, స్త్రీ సంబంధిత వ్యాధులు, ఎముకలు మరియు కీళ్ల నిపుణులు, గుండె నిపుణులకు సంబంధించిన వైద్యులు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలన్నారు. అవసరమున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కృష్ణ తులసి, డాక్టర్ శిరీష, డాక్టర్ వంశీచంద్రరాజు, డాక్టర్ చంద్రప్రకాశ్, డాక్టర్ నమ్రత సంపత్, డాక్టర్ ఫౌజియా, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు గంగు కృష్ణ చైతన్య, నక్షత్ర హాస్పిటల్ సీఈవో సోమ శేఖర్‌రెడ్డి, సీఎంవో బహబూబ్ బాషా, హర్ష, నవ్య, శిరీశ్, రాజేశ్వర్‌శర్మ, కొట్ర సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకొని సోనియా గాంధీకి కానుకగా ఇస్తామని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మహేశ్వరం మండల ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్ సునితా నాయక్ దంపతులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు ఒక తాను ముక్కలేనని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్శితులై బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నేతలు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. అనంతరం ఎంపీపీ సునీతా అంధ్యా నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ సిద్ధాంతాలకు ఆకర్శితులై బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఎనుగు జంగారెడ్డి, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, కూన యాదయ్య, వత్తుల రఘుపతి, కృష్ణా నాయక్, లాజర్, పాండు నాయక్, రాజు నాయక్ పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న ఎంపీపీ సునీతా నాయక్ దంపతులు

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



సీఎం రేవంత్‌రెడ్డితో మీర్‌పేట అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

- మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి

మీర్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమానంగా ఇస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన పార్లమెంటరీ ముఖ్య నాయకుల సమావేశంలో గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు ఏ విధంగా బాధ్యత తీసుకుని పనిచేయాలన్న దానిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం చేసినట్లు చెప్పా రు. చేవెళ్లకు సీఎం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నందునా నా యకులు, కార్యకర్తలందరూ సమష్టిగా కష్టపడాలన్నారు. కార్పొరేషన్ నుంచి అత్యధిక మెజారిటీ ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కూలీలకు సదుపాయాలు కల్పించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జంగయ్య

కొందుర్గు: ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు కనీస సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య విమర్శించారు. మంగళవారం ఆయన జిల్లేడ్ చౌదరిగుడ మండలం వనంపల్లిలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. పథకానికి నిధుల కొరత విధించి పతకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించి ఉపాధి పనులను సక్రమంగా సాగకుండా చేసిందన్నారు. కూలీలు పని చేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కూలీలకు అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బుచ్చయ్య, యాదయ్య, రమేశ్ పాల్గొన్నారు.

శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం

జేబీఆర్‌ఈసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి వెంకటరమణారెడ్డి



క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి, తదితరులు

మొయినాబాద్‌రూరల్: క్రీడలు మానవుడి శరీర దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని జేబీఆర్‌ఈసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జేబీఆర్‌ఈసీ ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ ప్రొఫెసర్ జె.గాయత్రీ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించే క్రీడోత్సవాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు అన్నారు. గెలుపు, ఓటములు సహజంగా తీసుకొని మూడురోజుల పాటు నిర్వహించే కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, క్యారమ్స్, టెబుల్ టెన్నీస్, చెస్ క్రీడల్లో విద్యార్థులందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌మూర్తి, జంగరాజు, ఎంఎల్‌ఎం ప్రసాద్, సివై రమేశ్, అబ్దుల్ రహమాన్, ఏఓ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప పోరుకు సర్వం సిద్ధం

- రేపే ఎమ్మెల్సీ ఎన్నికలు
- చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- షాద్‌నగర్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు
- కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపపోరుకు సమయం ఆసన్నమైంది. ఇందుకుగాను అధికారులు అన్ని ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ నెల 28న నిర్వహించే ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సంబంధించిన పోలింగ్ కేంద్రాన్ని షాద్‌నగర్‌లో ఏర్పాటు చేశారు.

చురుగ్గా ఏర్పాట్లు

పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సంబంధించిన పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో షాద్‌నగర్‌తో పాటు ఆమనగల్ పరిధిలోని మొత్తం మూడు మున్సిపాలిటీలు, పది మండలాలకు చెందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు మొత్తం 171 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, ఏప్రిల్ 2న కౌంటింగ్ నిర్వహిస్తారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వెంకట మాధవరావు ఆధ్వర్యంలో అధికారులు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు.

భారీగా సిబ్బంది

ఎన్నికల నిర్వహణకు 4 పోలింగ్ ఆఫీసర్లు, 13 మంది ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, 4 సెక్టార్ ఆఫీసర్లను నియమించారు. అదేవిధంగా శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏసీపీ రంగస్వామి నేతృత్వంలో పోలీసులు పోలింగ్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తు చర్యలు చేపట్టనున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఏసీపీ, 7 మంది సీఐలు, 20 మంది ఎస్‌ఐ, ఏఎస్‌ఐలు, 63 మంది కానిస్టేబుళ్లతో పాటుగా సీఆర్‌పీఎఫ్ బలగాలను రంగంలోకి దింపనున్నారు.

భారీ బందోబస్తు



పోలింగ్ కేంద్రం వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశాం. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అందరూ సహకరించాలి. ఎవరైనా అలజడులు సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు.

– రంగస్వామి, ఏసీపీ, షాద్‌నగర్

పకడ్బందీ ఏర్పాట్లు



ఎమ్మెల్సీ ఉపపోరుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాం. పోలింగ్ కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం.

– వెంకట మాధవరావు, ఆర్డీఓ, షాద్‌నగర్